క్లుప్తంగా

ఉచిత డీఎస్సీ శిక్షణకు గడువు పెంపు

కాకినాడ సిటీ: జిల్లాలో ప్రతిభా వంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు పొందేందుకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెట్‌లో ఉత్తీర్ణులై ఉంటే వారికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఆ టెస్టులో 85 శాతం, టెట్‌లో పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజ్‌ను ఇచ్చి వార్షిక ఆదాయం రూ. 2.50 లక్షలు లోపు ఉన్న వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

కరప: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన కూటమి నాయకులు కటకంశెట్టి బాబీ, పెంకే శ్రీనివాస బాబా, ప్రకాష్‌గౌడ్, ఎం.పుష్పలత, మండల బీజేపీ, టీడీపీ అధ్యక్షులు బండారు మురళి, దేవు వెంకటేశ్వరరావు తదితర నాయకులతో కలిసి వాకాడ, పెదకొత్తూరు, సిరిపురం, జి.భావారం, యండమూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి పథకం నిధులు రూ.70 లక్షల విలువ చేసే 8 పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. యండమూరు సర్పంచ్ మార్రెళ్ల శివ, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, ఏపీఓ జీవీ రమణారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి

కాకినాడ సిటీ: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య మిత్రలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య మిత్రల ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు జేసీని కలిసి పలు సమస్యలు వివరించినట్లు జిల్లా అధ్యక్షుడు వనచర్ల వీరభద్రరావు తెలిపారు. జేసిని కలిసిన వారిలో యూనియన్ జిల్లా నాయకులు యామన కృష్ణ, కె నాగమణి, కె జ్యోతి, అనిల్ కుమార్, కొప్పిశెట్టి బుజ్జి, డి రాజు, మహాలక్ష్మి, కిషోర్‌బాబు, అలీ తదితరులు ఉన్నారు.

నేడు 'విద్యారంగం-సవాళ్లు' పై సదస్సు

కాకినాడ సిటీ: రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 22న మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కాకినాడ కచేరిపేట యుటీఎఫ్ హోంలో విద్యారంగం-సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్‌వీఎస్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్ గోవిందరాజులు సోమవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త, జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక నాయకులు విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

'ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్' పై అవగాహన

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): స్థానిక లక్ష్మీ నగర్ నారాయణ స్కూల్‌లో 'ఈ-వేస్ట్ మెనేజ్‌మెంట్' పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కవిత సోమవారం తెలిపారు. కార్యక్రమానికి పాఠశాల ఏజీఎం రాఘవేంద్ర రావు ముఖ్య అతిథికిగా విచ్చేసి ప్రారంభించారన్నారు. ఈ-వేస్ట్ వ్యర్థాల వల్ల క్యాన్సర్ ముప్పు వాటిల్లుతుందని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ముఖ్యమన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినీ విద్యార్థులకు ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ పై అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ బారిన పడకుండా ఎంతో మందిని కాపాడవచ్చునని తెలిపారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

బోట్‌క్లబ్: కోన విజయ భాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక దంటు కళాక్షేత్రంలో జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను ఆద్యంతం ఆకట్టుకుంది. దంటు సూర్యారావు స్మారక కళా ప్రాంగణాన్ని దంటు భాస్కర్ ప్రారంభించారు. ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి జ్యోతి ప్రజ్వలన చేయగా విశిష్ట అతిథులుగా ప్రముఖ వైద్యులు రావుల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన నేటి దైనందిన జీవితంలో ఇటువంటి కార్యక్రమాలు మానసిక ఆనందాన్ని, ఉత్తేజాన్ని కలుగజేస్తాయన్నారు. వైద్యులు ముళ్లపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి వీనులవిందైన ఆపాత మధుర గీతాలను వినిపించిన గాయకులు బి.వి.ఎస్.ప్రభాకర్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు జానకిరామ చౌదరి మాట్లాడుతూ సంగీతాన్ని మనం భగవంతుడిని ఆరాధించే ఒక అనుసంధాన ఆరాధనా ప్రక్రియగా భావించిన కారణంగా భారతీయ సంగీతానికి ఉన్నతమైన స్థానం లభించదన్నారు. సంస్థ వ్యవస్థాపకులు బి.వి.ఎస్.ప్రభాకర్, కార్యనిర్వాహక సభ్యుల ఆధ్వర్యంలో యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు దంటు భాస్కర్, ముంజులూరి విశ్వేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం 'ఏదో ఒకరాగం పిలిచిందీ వేళా' పేరుతో జరిగిన సినీ సంగీత విభావరిలో అనీల వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఎమ్మెల్యే సారూ.. గోతులు పూడ్చండి..!

- గోతుల మయమైన కాకినాడ-రామచంద్రపురం రహదారి
- ప్రమాదాల పాలవుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని పాలకుల తీరుపై ప్రజాగ్రహం


పెనుగుదురు, కొరిపల్లి గ్రామాల మధ్య ఏర్పడిన గోతులు


వలసపాకల వంతెన వద్ద అంచు కోసుకుపోయిన రోడ్డు


కాకినాడ-రామచంద్రపురం రహదారిలో నడకుదురు వద్ద ఏర్పడిన గోతులు


కరప సమీపంలో ధ్వంసమైన రహదారి

కరప: ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వ కారణం ..గోతులు, తుప్పలమయం తప్ప అన్నట్టుగా ఉంది రహదారుల దుస్థితి. అడుగడుగునా గోతులు పడటంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే ప్రధాన రహదారి అని ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ద్విచక్రవాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతుకులమయమైన రోడ్లపై ప్రయాణాలు చేయాలంటే నరక యాతన అనుభవిస్తున్నామని, అయినా పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది.

రావులపాలెం, జొన్నాడ జాతీయ రహదారికి అనుసంధానం చేసే కాకినాడ-రామచంద్రపురం రోడ్డు మరీ దారుణంగా తయారైందని, పట్టించుకోని అధికారుల తీరును ప్రజలు దుయ్యబడుతున్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు కూటమి నేతలు రహదారుల్లో చిన్నగొయ్యి పడినా రాద్ధాంతం చేసేవారని, అధికారంలోకి వచ్చాక ధ్వంసమైన రహదారులు, రోడ్లలోని గోతులు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రాన్ని కలిపే కాకినాడ-రామచంద్రపురం రోడ్డు ప్రయాణికులు, వాహనచోదకుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. వైద్యం కోసం కాకినాడలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు, కలెక్టరేట్, కోర్టులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, కోర్టులకు, వ్యాపార కార్యకలాపాలకు కాకినాడ పరిసర మండలాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి ధ్వంసమవ్వడంతో గత ఏడాది అప్పటి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు కాకినాడ నుంచి నడకదురు, పెనుగుదురు మీదుగా ద్రాక్షారామం వరకు, పెనుగుదురు నుంచి కరప, వేళంగి మీదుగా రామచంద్రపురం వరకు ప్రధాన రహదారిని ఆధునీకరించారు. ఈ వర్షాకాలంలో కురిసిన వర్షాలకు నడకదురు, పెనుగుదురు, కరప, వలసపాకల, వేములవాడ, పెదకొత్తూరు గ్రామాల మధ్య కాకినాడ-రామచంద్రపురం రోడ్డు గోతులు పడ్డాయి. వాహన చోదకులు గోతుల్లో పడి అదుపుతప్పి కింద పడిపోయి ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి సమయంలో అయితే గోతులు కనబడక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

గోతులు కనబడటం లేదా..?

కాకినాడ-రామచంద్రపురం రహదారిలో నడకుదురు వద్ద, తూరంగి ఫ్లై ఓవర్ బ్రిడ్జివద్ద గత ఏడాది గోతులు పడ్డాయి, టెండరు వచ్చిన కాంట్రాక్టర్ పని ప్రారంభించడం ఆలస్యం చేశారు. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జ్ నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే పంతం నానాజీ స్థానిక నాయకులతో కలిసి హడావిడి చేసి, గోతుల్లో మట్టి వేసి, ప్రభుత్వం చేయలేని పని చేశామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక కాకినాడ-రామచంద్రపురం రోడ్డులోని గోతులు కనబడటంలేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే నానాజీ స్పందించి గోతులు పూడ్చించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల వాసులు కోరుకుంటున్నారు.

నానా అవస్థలు పడుతున్నాం..



జిల్లా కేంద్రం కాకినాడకు వెళ్లే ప్రధాన రహదారి ధ్వంసమవ్వడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటే నరకయాత పడుతున్నాం. ద్విచక్ర వాహనాలు గోతుల్లోపడి, అదుపుతప్పి పడిపోయి, ప్రమాదాలు జరగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారిలో పడిన గోతులను పూడ్చాలి.

– అప్పనపల్లి పెద్ద, వేములవాడ.

గాయాల పాలవుతున్నారు..



కాకినాడ-రామచంద్రపురం రోడ్డు అడుగడుగునా గోతులు పడటంతో రాకపోకలు సాగించాలంటేనే భయమేస్తోంది. సైకిళ్లు, మోటార్ సైకిళ్లు నడిపేవారు గోతుల్లోపడి అదుపుతప్పి ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి సమయంలో గోతులు కనబడక యాక్సిడెంట్లు ఎక్కువ జరగుతుండటంతో వాహన చోదకులు గాయాలపాలై, ఆసుపత్రుల్లో చేరుతున్నారు. నాయకులు, అధికారులు స్పందించి రామచంద్రపురం రోడ్డులో గోతులు పూడ్చించేందుకు చర్యలు తీసుకోవాలి.

– పెంకే సత్తిబాబు, కరప.

రూ.2 లక్షలకు టెండర్లు పిలిచాం..



కాకినాడ-రామచంద్రపురం రోహదారిలో వర్షాలకు గోతులు పడ్డాయి. వేళంగి నుంచి పెనుగుదురు వరకు గోతులు పూడ్చించేందుకు రూ.2 లక్షలు మంజూరు కాగా, ఫస్ట్‌కాల్‌లో ఎవరూ టెండరు వేయలేదు.మళ్లీ టెండరు పిలిచి, ఖరారైన వెంటనే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా సదరు కాంట్రాక్టర్‌తో గోతులు పూడ్చిస్తాం.

– కె.సాయిబాబారెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈఈ

గ్రీన్ ఛానల్ విజయవంతంపై వైద్యుల హర్షం

సహకరించిన ఎస్పీకి సత్కారం


ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు జ్ఞాపిక అందిస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): ఇటీవల కాకినాడలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను విశాఖపట్నం తరలించేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సహకారం అందించడం వల్ల ఆపరేషన్‌లు విజయవంతమైనట్లు అపోలో హాస్పిటల్ కాకినాడ సీఈఓ ఐవీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఎస్పీ కార్యాలయంలో అపోలో హాస్పిటల్ వైద్య బృందం సత్కరించి జ్ఞాపిక అందించింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను గ్రీన్ ఛానల్ ద్వారా విశాఖపట్నంలోని అపోలో హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్‌కు తరలించేందుకు పోలీసులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. సెప్టెంబర్ నెలాఖరున, అక్టోబర్ మొదటి వారంలోనూ మూడు సార్లు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారన్నారు. కిడ్నీలు, లివర్ అమర్చిన రోగులు ప్రస్తుతం బాగున్నారని తెలిపారు. కేవలం రెండు గంటల వ్యవధిలో విశాఖపట్నంలోని రోగులకు అవయవాల ఆపరేషన్ చేసేందుకు వీలైందన్నారు. జిల్లా పోలీసులు ఎస్కార్ట్ వాహనం ద్వారా ఈ గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారన్నారు. ఎస్పీని కలిసిన వారిలో కాకినాడ అపోలో హాస్పిటల్ డీజీఎం జీఆర్ మూర్తి, ప్రముఖ అబ్డోమినల్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ జీవీరావు, కిడ్నీ స్పెషలిస్ట్ సిహెచ్ అనిల్ కుమార్, మత్తు వైద్యులు ప్రగాఢ నాగేశ్వరరావు, యూరాలజిస్ట్ సిహెచ్ కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

లారీ ఢీకొని బాలుడి మృతి

ఎస్.రాయవరం: లారీ, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. అడ్డురోడ్డు సమీపంలో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలం పెద బోదిగళం గ్రామానికి చెందిన తాతా మనవళ్లు షేక్ మహ్మద్ ఖాదర్ బాషా, షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ(16) కలిసి స్కూటీపై అడ్డురోడ్డు వచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ వెనక నుంచి స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెనక కూర్చున్న జిలాని తూలి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న జిలానీని ముందుగా నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించే సరికి బాలుడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. జిలానీ ఈ నెల 18న పెదబోదిగళం గ్రామంలో జరిగిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలకు కాకినాడ నుంచి బోదిగళంలో ఉంటున్న తాతయ్య ఇంటికి వచ్చినట్టు చెప్పారు. ఎదిగొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కాకినాడలో ఉంటున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బకాయి పెట్టిన వేతనాలు చెల్లించాలని వినతి

కాకినాడ సిటీ: 108 ఉద్యోగులకు బకాయి పెట్టిన వేతనాలు తక్షణం చెల్లించాలని కోరుతూ 108 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్, ఎన్టీఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, అరబిందో ఎమర్జన్సీ మెడికల్ సర్వీసెస్ జిల్లా మేనేజర్ అవినాష్‌లను కలిసి ఉద్యోగులు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాంలు మాట్లాడుతూ అరబిందో ఎమర్జన్సీ మెడికల్ సర్వీసెస్ యాజమాన్యం నాలుగేళ్లుగా బకాయి పెట్టిన ఇంక్రిమెంట్లు ప్రతి ఉద్యోగికి 40 శాతం చొప్పున తక్షణం చెల్లించాలన్నారు. వేతనాలకు బకాయిలు పెట్టడం వల్ల కుటుంబాలతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని అన్నారు. గత ఐదేళ్లలో ఒక ఏడాది మాత్రమే ఇంక్రిమెంట్ చెల్లించిందన్నారు. బకాయి ఉన్న ఇంక్రిమెంట్లు చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధ పడతామని హెచ్చరించారు. యాజమాన్యం చెల్లించాల్సిన పీఎఫ్ వాటా కూడా ఉద్యోగి వేతనం నుండే మినహాయించు కుంటున్నారన్నారు. సరిపడా ఉద్యోగులు లేక సెలవులు కూడా మంజూరు చేయడంలేదని వాపోయారు. వాహనాలు సైతం మరమ్మతుల దశకు చేరుకున్నాయన్నారు. తక్షణం 108 ఎమర్జెన్సీ సర్వీస్ ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ దశల వారి ఆందోళన, పోరాటాలకు ఉద్యోగులంతా సిద్ధ పడాలని పిలుపునిచ్చారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, జిల్లా కోశాధికారి వరప్రసాద్, 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగింపునకు వినతి

కాకినాడ సిటీ: కాకినాడ 37వ డివిజన్ కచేరిపేటలో యూటీఎఫ్ టీచర్స్ హోం పక్కన ఏర్పాటు చేసిన బ్రాందీ షాపును తొలగించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నగర అధ్యక్షురాలు జి భూ లక్ష్మి మాట్లాడుతూ కచేరిపేట నుంచి అనేక మంది మహిళలు వివిధ ప్రాంతాలకు ఇండ్లలో పని చేసుకోవడానికి వెళుతుంటారని ఇక్కడ బ్రాందీ షాపు వల్ల మద్యం సేవించిన వారితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగిన వారు వాహనాలు రోడ్డుకి అడ్డంగా పెట్టి మహిళలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారన్నారు. తక్షణమే బ్రాందీషాపు ఆ ప్రాంతం నుంచి తొలగించాలని జేసీని కోరామన్నారు. సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబులు మాట్లాడుతూ గతంలో ఎక్సైజ్ అధికారులు నూతన మద్యం పాలసీ వచ్చినప్పుడు ఆ ప్రాంతంలో బ్రాందీ షాపు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని జేసీ రాహుల్ మీనాకు వివరించినట్లు చెప్పారు. యూటీఎఫ్ హోమ్‌లో వివిధ ప్రజా సంఘాలు సభలు, సమావేశాలు, సదస్సులు నిరంతరం జరుగుతూ ఉంటాయని బ్రాందీ షాపు వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బ్రాందీ షాపును తొలగించాలని కోరారు. లేని పక్షంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉద్యోగులకు హిందీ భాష పట్ల అవగాహన అవసరం

యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సాయి మనోహర్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ సాయి మనోహర్

బోట్‌క్లబ్ : యూనియన్ బ్యాంకులో పని చేస్తున్న సిబ్బందికి జాతీయ భాష హిందీ పట్ల అవగాహన ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ కాకి సాయి మనోహర్ అన్నారు. కాకినాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయంలో హిందీ పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించారు. పక్షోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ నారాయణ, రాహుల్ రామ్, ఇతర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమర వీరులకు ఘన నివాళి


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ దేవానందరావు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరులకు సోమవారం ఘన నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని అమరవీరుల స్థూపం వద్ద అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో 16మంది సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారన్నారు. వారందరిని స్మరించుకుంటూ కుటుంబ సభ్యుల సమక్షంలో ఘన నివాళులర్పించామన్నారు. పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులను పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడంతో పాటు జ్ఞాపికలను బహూకరించారు. దేశంలోని అమరులైన పోలీసు సిబ్బందిని గుర్తు చేసుకుంటూ వారి పేర్లను అసిస్టెంట్ కమాండెంట్ మురళి కుమార్ చదివి వినిపించగా బెటాలియన్ సిబ్బంది వారికి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోహన్ విద్యా సంస్థల అధినేత ఎం.మోహనరావు, ఆర్మీ మాజీ అధికారి, ఇంటర్నేషనల్ అథ్లెటిక్ మెడలిస్ట్ పి.ప్రసాదరెడ్డి, యూనియన్ మెడికల్ ఆఫీసర్లు లక్ష్మి, సునీల్, ఆర్‌ఐలు రామకృష్ణ, విఠలేశ్వరరావు, రవిశంకర్, రాము, అజయ్‌కుమార్, రిటైర్డ్ పోలీసు అధికారులు, యూనిట్ మెడికల్ స్టాఫ్, మినిస్ట్రీయల్ స్టాఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం ఏఎన్‌ఎంల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను గ్రేడ్ ఒన్ ఏఎన్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఏఎన్‌ఎంలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకురాలు సూర్యకుమారి మాట్లాడుతూ, గత 16 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో సెకండ్ ఏఎన్‌ఎంలుగా పని చేస్తూ, చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతున్న తమకు ప్రభుత్వం గ్రేడ్ ఒన్ ఏఎన్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించి ఆదుకోవాలని కోరారు. ఇటీవల జిల్లా అధికారులు ప్రమోషన్ విషయం పక్కనపెట్టి, రీడిప్లమెంట్ పేరుతో తమను తిరిగి వెనక్కి పంపే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన 16 ఏళ్లుగా పని చేస్తూ, ఏనాటికైనా తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేస్తారని ఆశించామన్నారు. రెగ్యులర్ చేయకపోగా, రీ డిప్లమెంట్ చేయడం దారుణమన్నారు. గ్రేడ్ త్రీ ఏఎస్‌ఎంలను గ్రేడ్ ఒన్‌గా ప్రమోషన్ చేయడం జరుగుతుందని, కేవలం సెకండ్ ఏఎన్‌ఎంలను మాత్రం ఎందుకు గ్రేడ్ వన్ ఏఎన్‌ఎంలుగా ప్రమోట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఝాన్సీరాణి, దుర్గ, భాగ్యలక్ష్మి, సీత, మరియమ్మ, మాలతి పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ సుధాకర్

కాకినాడ సిటీ: డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యల అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సుమారు 16 మంది ఫోన్ చేసి తమ సమస్యలను అధికారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ సుధాకర్ నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై సుమారు 38 వరకు అర్జీలు అందాయి. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృధ్వీచరణ్, మేనేజర్ శిరీష్, ఏసీపీ నాగశాస్తులు, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి వెంకట్రాజు, ఏడీహెచ్ సిరిల్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రజక వృత్తి దారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

కాకినాడ సిటీ: ప్రభుత్వం వృత్తిదారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు జరపాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కాకినాడ సీఐటీయూ కార్యాలయంలో వృత్తిదారుల సంఘం నాయకులు మాట్లాడారు. ఫెడరేషన్‌లో ఉన్న రజక సంఘాలకు బ్యాంకులతో సంబంధం లేకుండా రూ. 30 లక్షలు విడుదల చేయాలన్నారు. రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబాల్లోని యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేతి వృత్తిదారులు, బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని, 50 ఏళ్లకే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని, బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీ సబ్‌ప్లాన్‌తో ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సి గురుశేఖర్, జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు, రాష్ట్ర నాయకులు మడక రాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పోగోలు శ్రీనివాసులు, సూగూరు శేషాద్రి, రాయల మాల కొండయ్య, ఆవుల మంద రమణమ్మ, కొజ్జవరపు మాణిక్యం, పోలేపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో వ్యక్తికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: బంగారం చోరీ కేసులో వ్యక్తికి 7 నెలల జైలు, రూ.500లు జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్‌షరీన్ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామానికి చెందిన అనపర్తి శివ శంకర్ ఈ ఏడాది ఏప్రిల్ 2న కొవ్వాడ గ్రామంలో వాసంశెట్టి నరేష్ ఇంటిలో రూ.1.60 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. దీంతో నరేష్ ఇంద్రపాలెం పోలీసుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో శివ శంకర్‌పై నేరం రుజువు కావడంతో 7 నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ పి.రఘువీర్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో..

కాకినాడ లీగల్: సెల్‌ఫోన్ చోరీ కేసులో వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్‌షరీన్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామానికి చెందిన అనపర్తి శివ శంకర్ ఈ ఏడాది ఏప్రిల్ 2న కొవ్వాడ గ్రామంలో వి.కేశ్వరరావు ఇంటిలో రూ.30 వేలు విలువ గల సెల్‌ఫోన్ చోరీ చేశాడు. దీంతో కేశ్వరరావు ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో శివ శంకర్ పై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.